హైదరాబాద్ వార్త

నకిలీ ఉత్పత్తులు..అక్రమ లావాదేవీలు!

- ఫిర్యాదులుంటేనే చర్యలని పోలీసులు
- జోక్యం చేసుకోని సామాజిక పోరులు
- అప్రతిష్ట, తీరని నష్టాలతో బాధితులు
- చట్టవిరుద్ధంగా ఎన్నో ఘటనలు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:

డబ్బులు సంపాదించేందుకు ఎంతోమంది అక్రమార్కులు చెడు మార్గాలనే ఎంచుకుంటున్నారు. నితీనిజాయతీ, న్యాయమనేది లేకుండా అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వాల ప్రతిష్ట దిగజార్చడం, బాధితులకు తీవ్ర అన్యాయం చేస్తూ రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. ఏవ్యాపారాలు చేసిన ఎంతో కొంత నిబంధనలకు విరుద్ధంగానే ఉంటున్నాయి. కేవలం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదులొస్తేనే అది చట్టవిరుద్ధం, తప్పులని భావించి కేసులు, దర్యాప్తులు, ఇక విచారణలని హడావిడి చేస్తారు. అప్పటి వరకు అందరికి తెలిసినా...నేరమనే నిర్ధారణను గుర్తించేందుకు కంప్లైంట్ అనే ఫార్ములాను ఉపయోగిస్తున్నారు. దీంతో అక్రమాల పుణ్యం కాలం కాస్త గట్టెక్కిపోతోంది. తర్వాత గుండెలు బాదుకున్నా నష్టాన్ని పూడ్చలేం, బాధితులకు న్యాయం చేయలేరు అని సామాజికవేత్తలు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో అడుగడుగున నేరప్రేరిత కలాపాలు జరుగుతూన్నే ఉన్నాయి. కానీ చూసినా..చూడలేదనే విధంగా మనకెందుకు అని అనుకోవడంతోనే సమస్యలు వెలుగులోకి రావడం లేదు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని నెలలుగా స్పా ముసుగులో వ్యభిచార కలాపాలు సాగుతున్నాయి. కానీ తాజాగా దాడులు చేసి కేసు నమోదు చేశారు. నకిలీ సర్టిఫికేట్‌ల దందా కూడా జోరుగా సాగుతుంది. సమాచారం ఉన్నా.. ఫిర్యాదులు లేవనే సాకులతో కన్నెత్తికూడా చూడరు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ బహిరంగంగానే కనిపించిన కనుకరించని దుస్థితి. ఇలా ఎన్నో ఘటనలు చోటు చేసుకుంటున్న చర్యలు అంతంతే.

పట్నంలో మాయగాళ్లు..

నగరంలో చేసే వ్యాపారాలన్ని నిబంధనలకు అనుగుణమా? విరుద్ధమా? అనేది వినియోగదారులకు తెలియదు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ భవనాలల్లో నేమ్ బోర్డులు పెట్టుకుని కార్యకలాపాలు సాగస్తున్నారు. గ్రామీణ, జిల్లాల నుంచి వచ్చే వారికి సంస్థలపై వీటిపై సరైన అవగాహన లేకపోవడంతో ఆశతో సంప్రదిస్తారు. వేల రూపాయాలు వెచ్చించి.. తర్వాత చీటింగ్ అని, నష్టపోయామని భావించి లభోదిబో మనడమే తప్పా.. చేసేదేమి లేక సైలెంట్‌గా ఉండి పోతున్నారు. సదరు బాధితుడు మరోసారి వెళ్లక పోయిన ఇంకొకరు వచ్చి ఇలాగే జరగడంతో అదే మాదిరిగా వెనుదిరుగుతున్నారు. ఇలా ఎందరో బాధితులు రూ.కోట్లలోనే అక్రమార్కులతో మోస పోతున్నారు. పట్నంలో మాయగాళ్లు అని తెలుసు కోలేక వారి ఉచ్చులో పడుతున్నారు. ఇటీవల అబిడ్స్‌లో యాపిల్ బ్రాండ్‌పేరుతో నకిలీ పరికరా లను అమ్ముతున్నారని ఆ సంస్థ ఫిర్యాదు చేస్తే కానీ పోలీసులకు తెలియలేదు. తర్వాత మూకుమ్మడిగా టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేయ డంతో ఎన్నో దుకాణాల్లో నకిలీ ఐటెమ్స్ బయట పడ్డాయి. ఇలా ఎన్నో ఘటనలు ఆయా బాధితుల ఫిర్యాదులతోనే వెలుగులోకి వస్తున్నాయి. ఇక ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పబ్‌లు, డ్రగ్స్ విక్రయాలు, బెల్ట్ షాపులు, అక్రమ మద్యం, స్పా, సెలూన్ ముసుగులో వ్యభిచార కలాపాలు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్నాయి. దీంతో పోలీస్‌వ్యవస్థ నిర్లక్ష్యంపై విమర్శలు వెలువెత్తడంతో చివరకు ప్రభుత్వం అప్రతిష్ట పాలయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ముందస్తు చర్యలే నియంత్రణ...

అక్రమ కలాపాలు, నకిలీ ప్రొడక్ట్స్‌పై పోలీసుల దృష్టి చాలాముఖ్యం. కొత్తగా ప్రారంభమైన సంస్థలను పరిశీలించడంతో పాటు ఏయే కలాపాలు సాగిస్తున్నారో తెలుసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. మోసపోయిన తర్వాత ఫిర్యాదుతో ఎలాంటి ఉపయోగం ఉండదని సూచిస్తున్నారు. అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, కోఠి, సికింద్రాబాద్, మాదాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్‌తోపాటు ఆయా ప్రాంతాల్లో నిరంతర నిఘా, తనీఖీలతో బాధితులు నష్టపోకుండా కాపాడిన వారవుతారని పలువురు సామాజికవేత్తలు చెబుతున్నారు.

ముఖ్యంగా అక్రమకలాపాలను గుర్తిం చాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ముం దస్తు చర్యలతో అక్రమాలను కట్టడి చేయవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదుతో అప్పటి మోసాలేవెలుగుచూడడమే తప్పా విచారణలో గత కేసులను వెలుగుచూసిన బాధితుల నష్టాన్ని పూడ్చలేమని పేర్కొంటున్నారు.

మంత్రి వర్గంలో 'గ్రేటర్' నిల్

- ఉప ఎన్నిక, జిహెచ్ఎంసి ఎన్నికలు వస్తున్నాయని తెలియదా?
- హైకమాండ్ పునరాలోచన చేయకుంటే గ్రేటర్‌లో కనుమరుగే...!

హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త

రాష్ట్ర మంత్రివర్గంలో ముగ్గురు కొత్తవారికి కేబినెట్‌లో స్థానాలు కల్పించడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల్లో సంతృప్తిగానే ఉన్నప్పటికీ రాష్ట్రానికి గుండెకాయలాంటి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏ ఒక్కరికి మంత్రి పదవిని కల్పించకపోవడంపై తీవ్ర నిరాశతోపాటు అసంతృప్తి తారస్థాయికి పెరిగింది. మొత్తం గ్రేటర్ హైదరాబాద్‌లో 24 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మజ్లిస్‌కు సంబంధించిన హైదరాబాద్ నియోజకవర్గాన్ని మినహాయిస్తే విస్తరణ కేబినెట్‌లో తమకు మంత్రిపదవి ఖచ్చితంగా లభిస్తుందని సీనియర్లు కొండంత ఆశలు పెంచుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నగర నేతల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. బిఆర్ఎస్ నుంచి గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన గులాబి పార్టీకి దూరంగా జరిగి తన మాతృసంస్థ కాంగ్రెస్ పార్టీ కండువ కప్పుకున్నారు. అయితే ఆయనపై పార్టీ ఫిరాయింపుల చట్టంకింద చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఫిర్యాదులుపోవడం, న్యాయపరంగా సుప్రీంకోర్టువరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. అందువల్లే ఆయనకు మంత్రిపదవి దక్కకుండా పోయిందన్నది ఆయన కేడర్ వాదన. అయితే తమ నాయకుడికి ఉన్నంత అవగాహన గ్రేటర్ పరిధిలో మరెవరికీ లేదన్నది ఆయన అనుయాయులు హైకమాండ్‌కు ఫిర్యాదులు చేయ తలపెట్టారు. ఇక శివారు ప్రాంతాల పరంగా చూస్తే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు ముందు నుంచీ వినిపించింది. అసలు కేబినెట్ విస్తరణ అంటూ జరిగితే సీనియర్ ఎమ్మెల్యే ఆదినుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగిన మల్‌రెడ్డికే కేబినెట్ బెర్త్ లభిస్తుందని నియోజకవర్గ ప్రజలందరూ విశ్వసించారు. అందుకు తగినట్లుగా ఆయన రాష్ట్రనాయకత్వం, హైకమాండ్‌పైనా పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అయితే కేబినెట్‌లో ఆయనతో పాటు తన సామాజికవర్గం నుంచి ఎవ్వరికి అవకాశం లభించకపోవడం గమనార్హం. ఇక ఇదిలా ఉంటే ఆదినుంచి కాంగ్రెస్‌పార్టీనే అంటిపెట్టుకుని కొనసాగిన మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ తనకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని చిరకాలంగా కోరుతూ వచ్చారు. అయితే ఆయన కుమారుడు రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా చేసిన అనిల్‌కుమార్‌యాదవ్‌కు రాజ్యసభ పదవి ఉన్నందున అదే కుటుంబంలో మరొకరికి ఎలా ఇస్తారన్న వాదనతో ఆయన పేరు పక్కకు పోయింది. నగర కోట నుండి ఎమ్మెల్సీ స్థానాలు పొందిన బల్మూరి వెంకట్, సినీనటి విజయశాంతి కూడా మంత్రి పదవి కోసం పెట్టుకున్న ఆశలు, ప్రయత్నాలు ఫలించలేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో బిఆర్ఎస్, బిజెపి బలంగా ఉన్న నేపథ్యంలో.. పార్టీని ముందుండి నడిపించే నాయకుడు లేకపోవడవం గమనార్హం.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో వచ్చే ఉప ఎన్నికలు..వచ్చే ఏడాదిలో జరిగే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు సమాయత్తం కావాల్సి ఉన్న తరుణంలో అసలు గ్రేటర్ నుంచే కేబినెట్‌లో ప్రాతినిధ్యం లేకుండాపోయింది. శివారు నియోజకవర్గాలన్నీ గ్రేటర్‌లో విలీనం అయిన తర్వాత ఇదొక మినీ రాష్ట్రంగా ఉందన్న సంగతి తెలిసిందే. మొత్తం ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలన్నీ గ్రేటర్‌లోనే జరుగుతున్నాయి. రాజకీయ కార్యాకలాపాలకు కేంద్ర బిందువుగా కొనసాగుతున్న గ్రేటర్‌నుంచి కేబినెట్‌లో ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం కల్పించకపోవడం పైగా గ్రేటర్‌కు ఇన్‌ఛార్జిగా నియమించిన మంత్రి పొన్న ప్రభాకర్ ఉమ్మడి కరీంనగర్‌జిల్లావాసి కావడంతో ఆయనకు అంతగా గ్రేటర్‌పై పట్టులేకపోవడం వంటి అంశాలతో గ్రేటర్‌పై పూర్తి అవగాహన ఉన్న ఎమ్మెల్యేలను విస్మరించారన్న భావన మొత్తం సీనియర్ కాంగ్రెస్ నేతల్లో నెలకొంది.

ఇదే తీరు కొనసాగిస్తే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో గ్రేటర్ నుంచి కాంగ్రెస్‌కు పరాభవం తప్పదన్న బలమైన సంకేతాలు హైకమాండ్‌కు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి వర్గంలో ఖాళీగా ఉన్న మరో మూడుస్థానాల కోసంచేపట్టే మంత్రివర్గ విస్తరణ లో గ్రేటర్‌కు అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. త్వరలో ప్రకటించే పిసిసి కమిటీ, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నేతలు తమ ప్రయత్నాలు వేగం పెంచడం గమనార్హం.

మాగంటి గోపినాథ్‌కు కన్నీటి వీడ్కోలు

హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు ముగిశాయి. ఆయనకు బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. మాదాపూర్‌లోని ఆయన నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు కొనసాగింది. మాదాపూర్ నీరూస్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్‌నెంబర్ 45, ఫిల్మ్‌నగర్ మీదుగా అంతిమయాత్ర సాగింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా బిఆర్ఎస్ నాయకులు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, బంధువులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అభిమాన నాయకుడిని చివరిసారి చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. అంతిమయాత్రలో కెటిఆర్, హరీశ్‌రావు, ఆపార్టీ ఎమ్మెల్యేలు పాడె మోశారు. ఫిల్మ్‌నగర్ మహా ప్రస్థానంలో మాగంటి అంత్యక్రియలు అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. గోపీనాథ్ భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అంతకు ముందు గాల్లోకి మూడురౌండ్లు కాల్పులు జరిపారు.

మూడురోజుల నుంచి చికిత్స పొందుతూ..

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మూడు రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం వేకువజామున 5.45 గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఈ నెల 5న ఆయన ఏఐజీలో చేరారు. ఈ నెల 5న ఇంట్లో ఉన్న సమయంలో హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దాంతో వెంటనే కుటుంబీకులు గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, ఎమ్మెల్యే కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు గుర్తించారు. దాంతో సీపీఆర్ చేయడంతో గుండె తిరిగి కొట్టుకుంది. నాడీ, బీపీ సాధారణస్థితికి చేరడంతో ఐసీయూలో వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స కొనసాగించారు. అయితే, కొద్ది రోజులుగా కిడ్నీసంబంధిత సమస్యలతో గోపీనాథ్ బాధపడుతున్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట ఆయన ఏఐజీలోనే చేరి డయాలసిస్ చేయించుకున్నట్లు తెలిసింది. గుండెపోటు రావడంతో మూడురోజుల నుంచి చికిత్స పొందుతూనే ప్రాణాలు కోల్పోయారు. మాగంటి రాజకీయాల్లోకి రాకముందు సినీనిర్మాతగా నాలుగు చిత్రాలు నిర్మించారు. అదృష్టం కలిసిరాకపోవడంతో సినిమాలకు దూరంగా ఉన్నారు. కానీ ప్రొడ్యూసర్‌గా సక్సెస్ కాలేకపోయిన రాజకీయాల్లో చెర గని ముద్ర వేసి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా...

మాగంటి గోపీనాథ్ 1963 జూన్ 2న కృష్ణ మూర్తి, మహానంద కుమారి దంపతులకు జన్మించారు. 1980లో వెంకటేశ్వర ట్యుటోరియల్స్ నుంచి ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1983లో ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ పూర్తిచేశారు. 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయా ల్లోకి వచ్చారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1987, 1988లో హైదరాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా పనిచేశారు. 1988 నుంచి 93 వరకు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా, టీడీపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేశారు. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. 2014 తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుండి పోటీచేసి సమీప ఎంఐఎం అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9,242 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తరువాత టిఆర్ఎస్‌లో చేరారు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ టికెట్‌పై పోటీచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విష్ణు వర్ధన్‌రెడ్డిపై 16,004 ఓట్ల మెజారిటీతో గెలుపొం దారు. 2018 శాసనసభలో పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ(పీఈసీ) సభ్యుడిగా పనిచేశారు. గత ఎన్నిక ల్లోనూ మరోసారి జూబ్లీహిల్స్ నుంచే పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌పై గెలిచి హ్యాట్రిక్‌సాధించారు. నియోజకవర్గంలో మాగంటి గోపీ నాథ్ తెలంగాణే శ్వాసగా పనిచేసే బీఆర్ఎస్ జెండాను రెపరెపలాడించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ బిఆర్ఎస్ నగర అధ్యక్షుడుగా కీలక నేతగా కొనసాగారు.

మాగంటి భౌతికకాయానికి

మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ నివాళి

హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త

జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన అకాల మరణం పొందడం బాధాకరమని ఏపీ మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. ఆయన ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ఆయన కృషి చేశారని కొనియాడారు. మాగంటి గోపినాథ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మాగంటి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

మృగశిర ఎఫెక్ట్..!

జనంతో కిక్కిరిసిన చేపల మార్కెట్లు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:

మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్‌లోని అన్ని చేపల మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. నగరంలోని చేపల మార్కెట్లకు వందలాది రకాల చేపలు రావడంతో వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ ఇతర జిల్లాలనుంచి పెద్దఎత్తున హైదరాబాద్ రామ్‌నగర్‌లోని దయారా చేపల మార్కెట్‌కు దాదాపు 150 నుంచి 200 లారీల చేపలు దిగుమతి అయ్యాయి. కొర్రమీను, రూప్‌చంద్, రవ్వ, బొచ్చ, బంగారుతీగ, గ్యాస్‌కట్, వంజరం, ఖజూర, పిలాతి, జల్లలు, వాల్గా పండు, సముద్రం చేపలు పాంప్లెట్, పండుగొప్ప, మత్తి, రొయ్యలు, టైగర్ ప్రాన్స్ వంటి అనేక రకాల చేపలు ప్రస్తుతం రాంనగర్‌లోని దయారా చేపల మార్కెట్‌కు టన్నుల కొద్దీ దిగుమతి అయ్యాయని మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. మృగశిర సందర్భంగా తాము ఆశించిన మేరకు వ్యాపారం జరగలేదని ఆయన తెలిపారు. మార్కెట్‌కు పెద్దఎత్తున చేపలు దిగుమతి కావడంతో ధరలు తగ్గాయని ఆయన చెప్పారు. ఈసారి చేపలు ఎక్కువగా దిగుమతి కావడంతో కొర్రమీను కేజీ రూ.400-500లకు అమ్ముతున్నారు. గత మృగశిర సమయంలో దీని ధర కేజీ రూ.700-800 చొప్పున అమ్మేవారమని వ్యాపారులు తెలిపారు. ఈ ఏడాది కొర్రమీను పెద్దఎత్తున దిగుమతి కావడంతో రేటు చాలా పడిపోయిందని వాపోతున్నారు. బొచ్చ, రవ్వ లైవ్ చేపలు కేజీకి రూ.200-300చొప్పున విక్రయిస్తున్నామన్నారు. బంగారు తీగ, గ్యాస్ కట్, వంజరం, ఖజూర, పిలాతి, జల్లలు, వాల్గా పండు చేపలు కూడా కిలో రూ.100-300 రూపాయలకు చొప్పున అమ్ముతున్నట్లు తెలిపారు. రొయ్యలు, టైగర్ ప్రాన్స్ ఇతర సముద్రపు చేపలు కేజీ రూ.300-500 వరకు విక్రయిస్తున్నారు. దయరా చేపల మార్కెట్లో హోల్ సేల్ అండ్ రిటైల్‌గా దాదాపు 1000 నుంచి 1500 మంది ఈ వ్యాపారం చేస్తున్నారు. చేపల కటింగుల ద్వారా అనేక మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. కాగా, రాంనగర్‌కు చెందిన ప్రధానమార్కెట్‌లో చేపల ధరలు రోజువారిగానే ఉన్నా..ఇతర మార్కెట్లు, శివారు ప్రాంతాల్లో చేపల అమ్మకందారులు మాత్రం రెట్టింపు ధరలకు అమ్మకాలు సాగించారు.

కిలో కొర్రమెను చేపలు రూ.800 అమ్మకాలు

బేగంబజార్, జూన్ 8 ప్రభాతవార్త:

మృగశిరకార్తెను పురస్కరించుకుని ప్రధాన చేపల మార్కెట్‌లతోపాటు పలుచోట్ల చేపల విక్రయాలు ఊపందుకున్నాయి. బేగంబజార్ చేపల మార్కెట్ తోపాటు రిటైల్ అమ్మకాలు జరిగే పురానాపూల్, జియాగూడ, దోభీఘాట్, సబ్జిమండి, మంగళ్ హాట్, తదితర మార్కెట్‌లలో చేపలకు గిరాకి పెరగడంతో చేపల ధరలు ఒక్కసారిగా అకాశాన్నంటాయి. మృగశిర కార్తె ప్రవేశించిన రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తున్నందున మార్కెట్‌లలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున్న చేపల విక్రయాలుసాగాయి. దీంతో పురానాపూల్, మంగళ్‌హాట్, సబ్జీమండి మార్కెట్‌లు చేపల విక్రయాదారులు కొనుగొలుదారులతో కిటకిటలాడాయి. కాగా సాధారణ సమయంలో కిలోకు రూ. 300 వరకు ధరపలకగా ఆదివారం కావడంతో మూడు వందల రూపాయల నుంచి నాలుగింతలు పెరిగాయి. అధిక ధర ఉండే కొర్రమీను చేపలను కొనుగొలు చేయగా మధ్యతరగతి కుటుంబీకులు ఇతర చేపలను కొనుగొలు చేయడం కనిపించింది. కిలో కొర్రమెను 800 రూపాయలకు విక్రయాలు చేశారు.

కొనసాగుతున్న చేప ప్రసాదం పంపిణీ

దేశ విదేశాల నుంచి భారీగా అస్తమా బాధితులు

గోషామహల్, జూన్ 8 ప్రభాతవార్త:

చేప ప్రసాదం వేయించుకునే వారి సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మత్స్యశాఖ అధికారులు ఆదివారం అర్ధరాత్రి వరకు 50 వేల పై చిలుకు కొరమీనులను విక్రయించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. దీనికితోడు ఉబ్బసం వ్యాధిగ్రస్తులు బెల్లం ద్వారా ప్రసాదాన్ని వేయించుకున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు మృగశిర కార్తె ప్రారంభంతో కావడంతో బత్తిని సోదరులతో మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చేప ప్రసాదాన్ని వేసి ప్రారంభించారు. బత్తిని సోదరులు అంతకుముందు దూద్ బౌలిలో తమ నివాసంలో ప్రత్యేక పూజలు చేసి చేపప్రసాదాన్ని భారీ పోలీసు బందోబస్తుమధ్య నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానికి తీసుకువచ్చారు. చేప ప్రసాదాన్ని 32 కౌంటర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చేప ప్రసాదాన్ని వేస్తున్నారు. సోమవారం వరకు కొనసాగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది వ్యాధిగ్రస్తులకు చేపపిల్లల టోకన్ల పంపిణి కొనసాగిస్తున్నారు. ఇతర శాఖల అధికారులు చేపప్రసాదం పంపిణా కార్యక్రమం సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షిస్తున్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని నాంపల్లి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లు, ఎంజిబిఎస్ బస్ స్టేషన్లు, ప్రయాణికులతో కిటకిటలాడాయి. చేపప్రసాదం పొందేందుకు రాష్ట్రంలోని ఆయా జిల్లాలలోపాటు దేశం నలుమూలనుంచి వచ్చిన ఆస్తమా భాధితులు అధిక సంఖ్యలో తరలిరావడం కనిపించింది. దీంతో నాంపల్లి, గాంధీభవన్, అబిడ్స్, బేగంబజార్, ఎంజెమార్కెట్ తదితర ప్రాంతాల్లో రద్దీ అధికంగా కనిపించింది. కాగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకుగాను పోలీసులు శ్రమ పడాల్సి వచ్చింది. సుదూర ప్రాంతాలనుంచి తరలివచ్చిన ప్రయాణీకులు శనివారం రాత్రి నుంచే రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫామ్‌లపై బస చేయడం కనిపించింది. వేలాది మంది వ్యాధిగ్రస్థులు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు తరలిరావడం కనిపించింది. తెల్లవారుజాము నుంచే ప్రసాదం కౌంటర్లు అస్తమా రోగులతో కిటకిటలాడాయి. కాగా ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. పోలీసులు భారీఎత్తున్న సిబ్బందిని మోహరింపచేశారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అక్కడే ఉండి చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అగ్నిమాపక సిబ్బంది ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేశారు. మత్స్యశాఖ అధికారులు కొర్రమీను అందుబాటులో ఉంచారు. రెవెన్యూశాఖ అధికారులు అన్నిశాల అధికారులు తీసుకు ంటున్న చర్యలను ఆయా విభాగాల అధికారులు పరిశీలించారు. పోలీస్‌శాఖ ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టారు. స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసుకుని పోటాపోటీగా రోగుల వెంట వచ్చిన వారికి ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక, సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు.

కాగా మృగశిర కార్తెను పురస్కరించుకుని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన చేప ప్రసాదానికి వచ్చిన రోగులకు జలమండలి ఆధ్వర్యంలో ఉచితంగా మూడు లక్షల యాభై వేల మంచినీటి ప్యాకెట్లను అందచేస్తున్నట్లు వాటర్‌వర్క్స్ గౌండ్స్ లో గౌలిగూడ, హిందీనగర్ సెక్షన్ల మేనేజర్లు ప్రత్యేక మంచినీటి స్టాల్స్‌ను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జోరుగా సాగిన పుట్‌వాత్ వ్యాపారం...

చేప ప్రసాదం పంపణీ సందర్భంగా ఎగ్జిబిషన్ మైదానం పరిసర ప్రాంతాల్లో పుట్‌పాత్ వ్యాపారం జోరుగా కొనసాగింది. వేలాదిగా తరలివచ్చిన అస్తమా వ్యాధిగ్రస్తులకు వారి బందువులు నాంపల్లి, గాంధీభవన్, ఎంజెమార్కెట్, ఎగ్జిబిషన్ మైదానం తదితర ప్రాంతాలో పుట్‌పాత్‌పై ఏర్పాటైన దుకాణాలలో రద్దీ అధికంగా కనిపించింది. చేప ప్రసాదం స్వీకరించినతరువాత కార్తీక మందు కోసం చిన్న డబ్బాలను జోరుగా అమ్మకాలు చేశారు. దీనికితోడు చీరెలు, మహిళలు ధరించే రోల్డ్‌గోల్డ్ పూసాలను కొనుగొలు చేయడం కనిపించింది.

మైకోడ్‌లో శ్రీ భద్రప్ప ఆలయ ధ్వజస్థంభం ఏర్పాటు చేస్తున్న భక్తులు

మైకోడ్‌లో శ్రీభద్రప్ప ఆలయ ధ్వజ స్థంభం ఏర్పాటు

మనూర్, జూన్ 8, ప్రభాతవార్త: మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో శ్రీభద్రప్ప ఆలయానికి ఆదివారం వేద బ్రాహ్మణులు మంత్రాలు వల్లిస్తుండగా ధ్వజస్థంబం ఏర్పాటు చేశారు. ఉదయం భక్తులు గ్రామంలోని పురవీధులగుండా పల్లకి సేవను ఊరేగిస్తూ ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో శ్రీ భద్రప్ప దేవాలయ అభివృద్ధి ఉత్సవ కమిటి సభ్యులు, వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నేరవేరుస్తున్న కాంగ్రెస్ సర్కార్

-రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జాడిమల్కాపూర్‌లో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: పేద ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లి అధ్యక్షులు, మాజీ ఎంపిపి అధ్యక్షులు, మాఈజ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నిజాంపూర్‌లో చేపమందు పంపిణీ

నిజాంపూర్‌లో చేప మందు వేస్తున్న ఆడెం సోదరులు

సదాశివపేట, జూన్ 8, ప్రభాతవార్త: మృగశిరకార్తెను పురస్కరించుకుని ఆదివార మండల పరిధిలోని నిజాంపూర్‌లో చేపమందు పంపిణీ కార్యక్రమం నిర్వహించడంతో ఉమ్మడి మెదక్, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు చేరుకున్నారు. పెద్దసంఖ్యలో గ్రామానికి చేరుకున్న ప్రజలకు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆడెం బ్రదర్స్ మనోహర్, రవీందర్ ప్రతి సంత్సరం మాదిరిగా చేప ప్రసాదాన్ని అందచేశారు. చేప మందు తీసుకుంటే అస్తమా, ఉబ్బసం, అలర్జీ వ్యాధులకు దూరంగా ఉంటామని చేపమందును తీసుకున్న ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆడెం బ్రదర్స్ మనోహర్, రవీందర్‌లు మాట్లాడుతూ చేపమందును తీసుకున్న వారు కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుందని, మందును తీసుకున్న వారికి నియమాలు సూచించామని పేర్కొన్నారు.

పద్మశాలి సమాజం అభివృద్ధికి సహకరిస్తా

టిపిసిసి సభ్యులు, బిఎన్ఆర్‌కెస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం

చంద్రంను సన్మానిస్తున్న పద్మశాలి సమాజం

సిద్దిపేట అర్బన్, జూన్ 8, ప్రభాతవార్త : పద్మశాలి సమాజం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని టిపిసిసి సభ్యులు, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో ఆదివారం ఆలయ పూజారులు, పద్మశాలి సమాజకార్యవర్గం ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో సింహద్వారం ఇనుప చానల్ గేట్ బదులుగా టేకు ద్వారం నిర్మించే పనులను పద్మశాలి సమాజం అధ్యక్షులు కాముని రాజేశంతో కలిసి దరిపల్లి చంద్రం పూజచేసి ప్రారంభించారు. అలయ కమిటి సభ్యులు, పురోహితులు చంద్రంను మెమోంటో, శాలువాతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాయల శ్రీహరి, సహాయ కార్యదర్శి గుండు రవితేజ, చిలుక అంజనేయులు, కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, దీకొండ మహేష్, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్‌కుమార్, వీరబత్తిని నగేష్, అడేపు నాగరాజు, గోటిపాముల జలజ, సిరిముల సునీత తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ రన్‌లో పాల్గొన్న ఎన్‌సి.సంతోష్

గజ్వేల్ టౌన్, జూన్ 8 (ప్రభాతవార్త): హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో త్రిషిక బిల్డర్స్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన 20కె, 10కె, 5కె రన్నింగ్ మారథాన్ కార్యక్రమంలో మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, మాజీ ఎస్ఏటిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, గజ్వేల్‌కు చెందిన ఎఫ్ఎఫ్‌యు సభ్యులు ఎండి.అరీఫ్, నరేందర్‌రెడ్డి, ద్వారకా సభ్యులు మల్లేష్, కనకరాజు, జీవన్, రమేష్‌లు పాల్గొన్నారు.

మారథాన్ రన్‌లో పాల్గొన్న ఎన్‌సి.సంతోష్, ఎఫ్ఎఫ్‌యు సభ్యులు

పల్లె జీవిత వెతలకు అద్దంపట్టిన 'మనసు పరిమళం'

రవీంద్రభారతి, జూన్ 8 ప్రభాతవార్త : మనసు పరిమళం పుస్తకం పల్లె ప్రజల జీవిత వెతలకు అద్దంపట్టిందని ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకావిష్కరణ కావించిన గంటా మనోహర్‌రెడ్డి అన్నారు. పల్లెజీవితంలోని వెతలను ఆటవెలదిలో చిత్రికపట్టిన మట్టిపాట శతకంపై ప్రముఖ కవయిత్రి మోదేపల్లి శీనమ్మ లోతైన విశ్లేషణ కావించారని, రెండు దశాబ్దాల కిందట పల్లెల దైన్యాన్ని మూలకవి డా. ఏనుగు నరసింహారెడ్డి మట్టిపాటలో చిత్రించిన విధానాన్ని తనదైనశైలిలో రచయిత్రి చర్చించారని ఆయన తెలిపారు. ప్రముఖ రచయిత డా. పోరెడ్డి రంగయ్య సభాధ్యక్షతన రామదాసు సాహితీ కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో మోదేపల్లి శీనమ్మ రచించిన మట్టిపాటలో మనసు పరిమళం గ్రంథావిష్కరణ ఘనంగా జరిగింది. గ్రంథ అంకిత స్వీకర్త కవి గాయకుడు వాకిటి రామిరెడ్డి ఇది తన అదృష్టమని రచయిత్రికి ధన్యవాదాలు తెలిపారు. రంగయ్య అధ్యక్షోపన్యాసంలో మట్టిపాట పుస్తకంగా రాకముందు నుండి ఆ పద్యాలు తనకు తెలిసినవేనని, అది క్యాసెట్‌గా రావడం, పుస్తకంగా రావడం ఎంత ఆనందమో ఆ గ్రంథమే ఒక విమర్శ గ్రంథానికి ఆకారంగా మారడం గొప్ప సాహిత్య చర్చనీయాంశమన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లా రాజశేఖర్‌రెడ్డి, సాధనాల వెంకటస్వామినాయుడు, డా. రాధాకుసుమ, రమేష్, వెంకటకృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పద్మ, నాగేశ్వరరావు, డా. రవీంద్రబాబు, జె.వి.కుమార్‌లతోపాటు మూలకవి డా. ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మనోహర్‌రెడ్డి, రంగయ్య, శీనమ్మ తదితరులు

భక్తి శ్రద్ధలతో మహాకుంబాభిషేకం

మలక్‌పేట, జూన్ 8ప్రభాతవార్త: మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లోని శ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి, లక్ష్మి గణపతి సహిత శ్రీ భవాని శంకర సహిత నవగ్రహ నాగదేవత దేవాలయంలో మూడు రోజుల పాటు ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, సహస్ర ఘటాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం సహస్ర 1008 కలశ ఉద్వాసన, దేవాలయ శిఖర మరియు గరుడ ఆంజనేయ స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, మహా కుంభాభిషేకం, బలి ప్రధానం, మహాపూర్ణాహుతి, శిఖరానికి పూర్ణాభిషేకం, శ్రీసీతారాముల కళ్యాణం, వేద ఆశీర్వచనం, అన్నదానం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో దేవాలయం నిర్మించి 33 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహాకుంభాభిషేకం, సహస్ర ఘటాభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెకోలేకార్ శ్రీనివాస్, కోట్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మార్కెట్‌లోని దేవాలయంలో ఇటువంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఉపాధ్యక్షులు దుగ్గ జగదీష్ కుమార్, మాదారం కృష్ణ, వంజరి వినోద్ కుమార్, డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్ సింగ్, సభ్యులు గంగా బాలాజి, విశ్వం, తల్లం శ్రీకాంత్, అనిల్ కుమార్, నూకా సంతోష్, గందె శ్రీధర్, ప్రమోద్, సురేష్, మైల రవికాంత్, వెంకటేష్, ఆంజనేయులు, అజయ్‌కుమార్, బి.సురేందర్, రజనీకాంత్, ఓం ట్రేడర్స్ కృష్ణ, వెంకట్‌రెడ్డి, ప్రకాష్ మహతో, అయ్యన్నగారి పాండు, వంజరి సంతోష్, వంజరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌పి.బాలు స్ఫూర్తి పురస్కారాలు-2025' ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: కృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'సీల్‌వెల్ సినీ సుస్వరాలు' కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి.బాలు, ఎన్‌టిఆర్, హీరో కృష్ణ జయంతి వేడుకలు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగాయి. సినీ గేయ రచయిత శ్రీరామ్ తపస్వి, సంగీత్ సీతారే వినోద్ బాబు, చింతలపాటి సురేష్‌లకు 'ఎస్‌పి.బాలు స్ఫూర్తి పురస్కారాలు-2025' ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మహ్మద్ రఫీ, విఎల్ఎన్.శర్మ, కృతిలయ చైర్మన్ డాక్టర్ బొక్కా భీమ్‌రెడ్డి, సగర సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాలహరికృష్ణ, మహిళాకాంగ్రెస్ నాయకురాలు శ్రీమణి, కుసుమ భోగరాజు, నిర్వాహకురాలు మధుర గాయనీ ఆమని పాల్గొన్నారు. 'నవరస గాయని' ఆమని స్వరసారథ్యంలో ప్రముఖ గాయనీ గాయకులు సుభాష్, రాజన్, కృష్ణప్రసాద్, శరత్, శ్రీదేవి, శిరీష, రోహిణి, కార్తికేయ చే గాన కార్యక్రమం అద్భుతంగా సాగింది.

ఎపి సిఎంను కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే

- రాజకీయ ప్రాధాన్యతను సందరించుకున్న "బాబు-ప్రకాశ్‌గౌడ్"ల భేటి

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, జూన్ 8 ప్రభాతవార్త : తన రాజకీయ గురువు, రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ తరుణంలో గురు-శిశ్యుల భేటి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. చంద్రబాబు నాయుడు గతంలో చాలామార్లు హైదరాబాద్‌కు వచ్చినా కలువని ప్రకాశ్‌గౌడ్, ఇప్పుడు కలువడం వెనుకాల ఏదో ఆంతర్యం ఉండి ఉంటుందని రాజకీయ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. తన రాజకీయ ప్రస్థానం తెలుగుదేశంతోనే ప్రారంభమవడం, తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశంను చంద్రబాబు నాయుడు ఇవ్వడంతో ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాడు. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగు సార్లు గెలిచి రాజేంద్రనగర్‌లో తనకు ఎదురే లేదని నిరూపించుకున్నారు. తెలంగాణ విడిపోయాక రెండోమారు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు తిరిగి తెలంగాణలో కూడా టిడిపిని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. పార్టీని వీడి ఇతర పార్టీలకు వెళ్లిన సీనియర్ నాయకులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లందరిని తిరిగి పార్టీలోకి ఆహ్వానించి పార్టీని బలోపేతం చేసేందుకు పెద్ద ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి, బిజెపి, జనసేన కూటమితో పోటీ చేసి ఏపిలో వలే అధికారంను చేజిక్కించుకునే ప్రయత్నాలు ఇప్పటి నుంచే ప్రారంభించినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చంద్రబాబు నాయుడిని కలువడం ఈ ప్రణాళికలో భాగమేనా? అన్న అనుమానాలకు మరింత బలాన్ని ఇస్తుంది. ఇన్నాళ్లు స్థబ్దుగా ఉన్న టిడిపి నాయకులు గత ఏడాది కాలంగా మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. కొత్త కమిటీలు వేసి నాయకులను నియమించుకొని, పార్టీని మళ్లీ ఇంటింటికి తీసుకెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రకాశ్‌గౌడ్‌కు బలమైన అనుగణం ఉంది. ఆయన ఏ పార్టీలోకి వెళ్లినా తన అనుచరగణం ఆయనతోనే వెళ్తున్నారు. పార్టీ ఏదైనా ఎన్నికల్లో గెలుపు మాత్రం తనదేనని వరుసగా నాలుగుసార్లు రుజువు చేసుకున్న బలమైన నేత ప్రకాశ్‌గౌడ్. ఇలాంటి వారిని తిరిగి టిడిపిలోకి రప్పిస్తే ఇటు గ్రేటర్ హైదరాబాద్, అటు రంగారెడ్డి జిల్లాలో పట్టు పెంచుకోవచ్చన్న ఉద్దేశంతోనే "చంద్రబాబు నాయుడు - ప్రకాశ్‌గౌడ్" ల భేటి జరిగి ఉండవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి భేటి సాధారణమైనదేనా? లేక సోషల్ మీడియాలో వస్తున్న టిడిపి బలోపేతం కోసమే జరిగిందా? అన్నది మునుముందు కాలమే నిర్ణయిస్తుంది.

కనుల పండువగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర శివార్లలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న మామిడిపల్లి గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామంలోని దేవాలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టాప నోత్సవాల్లో భాగంగా ప్రతిష్టాపనలు జరిగిన తర్వాత ఆదివారం కళ్యాణో త్సవాలను జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థుల,ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శివ్వంపేట, జూన్ 8 ప్రభాతవార్త : శివ్వంపేట్ మండలం పిల్లుట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 01సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం లింగాపూర్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు వీరప్పగురూజీ, నరసింహశర్మ, బస్వరాజు, సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పిలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనతోనే ఆయా రంగాలలో స్థిరపడి ఓ స్థానంలో ఉన్నామంటూ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎపి సిఎం చంద్రబాబును కలిసిన తీగల కృష్ణారెడ్డి

నరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త: టిడిపి జాతీయ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఆదివారం హైదరాబాద్ నగర మాజీ మేయర్, మాజీ హుడా ఛైర్మన్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కలిసారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టిడిపిలో ఒక వెలుగు వెలుగు వెలిగి పార్టీ హైదరాబాద్ అధ్యక్షునిగా, హుడా ఛైర్మన్‌గా, ప్రతిష్టాత్మక హైదరాబాద్ నగర మేయర్‌గా పని చేసిన తీగల కృష్ణారెడ్డి రాష్ట్రవిభజన తర్వాత 2014లో టిడిపి తరపున పోటీ చేసి మహేశ్వరం ఎమ్మెల్యేగా విజయం సాధించడం జరిగింది. ఆ తర్వాత 2015లో ఆయన పార్టీని వీడి టిఆర్ఎస్‌లో చేరి 2018లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున టిక్కెట్ ఆశించి భంగపడ్డ తీగల ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికలకు ముందు పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆయన కాంగ్రెస్‌లో ఉన్నా కొంత కాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం ఆయన బంధువైన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మనువరాలి వివాహం సందర్భంగా పెండ్లి కార్డు ఇవ్వడానికి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి చంద్రబాబును కలిసారు. అయితే బాబును కలిసిన వెంటనే విలేకరులతో ఆయన టిడిపిలో తాను చేరబోతున్నట్లు అప్పట్లో ప్రకటించడం సంచలనంగా మారింది. ఆనాటి నుండి ఆయన ఇటు కాంగ్రెస్‌ను వీడక అటు టిడిపిలో చేరక స్తబ్దుగా ఉన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ నగరానికి వచ్చిన ఎపి ముఖ్యమంత్రి, జాతీయ టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని మరోసారి కలవడం మళ్ళీ రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తీగల రాజకీయ భవిష్యత్తు ఏ మలుపు తిరుగుతుందో ఆసక్తికరంగా మారింది.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

తార్నాక, జూన్ 8 ప్రభాతవార్త : మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ అన్నారు. లాలాపేట్‌లోని మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. మున్నూరు కాపు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం మున్నూరు కాపులు పనిచేస్తున్నారని అన్నారు. అనంతరం సంఘం అధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, కోశాధికారి కొండమడుగు నాగరాజు మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా లాలాపేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిలుకూరి వెంకట్‌రావు, క్రిష్ణస్వామి, సేవెల్లి వెంకటేష్, గర్షమోహన్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సంజీవరెడ్డినగర్, జూన్8, ప్రభాతవార్త: ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో యాభై అయిదు ఏళ్ల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆకుపచ్చ చొక్క, నీలం రంగు ప్యాంట్ ధరించిన వ్యక్తి అపస్మారకస్థితిలో పడిఉన్నాడని సమాచారం అందింది. దీంతో ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందాడు. తలపై తీవ్ర గాయం కనిపించడంతో ధనలక్ష్మి బ్యాంకు భవనంపై అదుపుతప్పి కిందపడ్డారేమోనని భావించారు. మృతుడు ఒంటిపై, చొక్కాను పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. వెంటనే పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు ఎవరైన ఉంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగానికి వెళ్లిన వివాహిత అదృశ్యం

నార్సింగి, జూన్ 8 ప్రభాతవార్త : ఉద్యోగానికి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సికింద్రాబాద్ సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన శ్రీరామ్ యోగిబాబు భార్య సుచరిత(21) కోకాపేట్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఉన్న ప్రిస్టేజ్ స్కైటెక్ కంపనీలో ఫ్లోర్ మేనేజర్‌గా పని చేస్తుంది. ఈ నెల ఏడో తేదీ మధ్యాహ్నం 12.గంటల ప్రాంతంలో తన భార్య సుచరితను ప్రిస్టేజ్ స్కైటెక్ కంపనీ వద్ద శ్రీరామ్ వదిలిపెట్టాడు. కొంత సమయానికే ఆమె కంపనీకి వెళ్లిందా? లేదా? అని ఆరా తీయగా రాలేదని సమాచారం వచ్చింది. దీంతో అతడు కంపనీ పరిసర ప్రాంతాలలో, స్నేహితులు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద వాకాబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తన భార్య అదృశ్యమైందని పేర్కొంటు నార్సింగి పోలీసులకు శ్రీరామ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదృశ్యమైన సమయంలో సుచరిత మెరూన్ కలర్ డ్రెస్ ధరించి ఉందని, చేతికి స్మార్ట్ వాచ్ ఉందని, మొబైల్ ఫోన్ ఉందని, ఆచూకి తెలిసిన వారు 100కు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

మలక్‌పేట, జూన్ 8 ప్రభాతవార్త: అక్రమ సంబంధం విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగి హత్య జరిగిన సంఘటన ఛాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం..అక్బర్‌బాగ్ డివిజన్ జడ్జస్ కాలనీకి చెందిన కుర్దస్(30) డబీర్‌పురాకు చెందిన ఇర్షాద్ అలి(25) వీరి ఇరువురి మధ్య మైనర్ బాలిక అక్రమ సంబంధం విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన ఇర్షాద్‌అలి, కర్దస్‌పై కత్తితో ఛాతిపై పొడిచి హత్య చేశాడు. సమాచారం అందుకున్న ఛాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ బిజెపి నూతన కార్యవర్గ దృశ్యం

బిజెపి పట్టణ కార్యవర్గం ఏర్పాటు

సిద్దిపేట అర్బన్, జూన్ 8, ప్రభాతవార్త : బిజెపి సిద్దిపేట పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా లక్కరసు కృష్ణ, లక్ష్మారెడ్డి, చెంది సత్యనారాయణ, గందె సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా పిట్ల నరేష్, కెమ్మసారం సంతోష్, కార్యదర్శులుగా శివరాత్రి నగేష్, పవన్‌తేజ్‌రెడ్డి, విరమల్లు సతీష్, బోయిని వినోద,అధికార ప్రతినిధిగా వెంకట్‌రావు, బీసీ మోర్చా అధ్యక్షులుగా అరికె యాదగిరిలను ఎనున్నట్లు వివరించారు. బీసీ మెర్చా ఉపాధ్యక్షులుగా ప్రసాద్, కోశాధికారిగా ఎర్వ గణేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గానికి నియామకం పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ కార్యవర్గంలో అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్‌కు, అధిష్టానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపార

మాజీ రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవిందకు శుభాకాంక్షలు తెలుపుతున్న కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మద తదితరులు

మాజీ రాష్ట్రపతిని కలిసిన బానుక నర్మదమల్లికార్జున్

కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త: భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ గోవిందన్ ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బానుక మల్లికార్జున్, అధికార ప్రతినిధి బి.ఎన్. శ్రీనివాస్ తదితరులులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముప్పిడి గోపాల్

కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం బోయిన్‌పల్లి మారెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత వి.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మద

కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్ తెలిపారు. ఆదివారం 1వ వార్డులోని హన్‌మాన్‌జి కో-ఆపరేటీవ్ సొసైటీ కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను అమె ప్రారంభించారు. ఈ సందర్భంగా బానుక మాట్లాడుతూ బోర్డు పరిధిలో లే అవుట్‌లో ఎటువంటి బోర్డు అనుమతులు లేకుండా నిర్మాణం పనులు చేపట్టడం వల్ల ప్లాట్ ఓనర్లు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారన్నారు. అప్పటి సిఈఓ సుజాత గుప్తా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం వల్ల ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు లభించాయన్నారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, వార్డు అధ్యక్షులు రాఖేష్, రాయల్ కుమార్, ఓం ప్రకాశ్ యాదవ్, కాలనీ అధ్యక్షులు సుంకర సత్య నారాయణ, ప్రతినిధులు గణపతి పటేల్, శ్రీనాథ్‌ఫని, కె.శ్రీనివాస్, చక్రవర్తి పాల్గొన్నారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర

శోభాయాత్రలో పాల్గొన్న హిందువులు

నిజాంపేట్, జూన్ 8, ప్రభాతవార్త: దేశంలో హిందువులందరూ అరబ్, మొగల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఒక ఆశాకిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీమహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన జ్యేష్ట శుద్ధ త్రయోదశి రోజును మన దేశమంతా హిందూ సామ్రాజ్య దినోత్సవంగా వైభవంగా ప్రతి సంవత్సరం జరుపుకుంటాం. ఆదివారం 352వ హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం(ఆర్ఎస్ఎస్) పిలుపు మేరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ కోతి బొమ్మల సెంటర్ నుంచి వివిధ రహదారుల గుండా హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా జరిగింది. శోభాయాత్రలో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, మధుజీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామా రావు, బిక్షపతియాదవ్, శేషారావు, నరేంద్రచౌదరి, శ్రీనివాస్‌గుప్తా, దాసి నాగరాజు, సుమన్‌రావు, కిశోర్, వెంకటేశ్, కౌశిక్‌నాయుడు, లింగారెడ్డి, వినీత్, అశోక్, భారతి, శిల్ప, కల్యాణి, సూర్యనారాయణ, డాక్టర్ వెంకన్న, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్, రాజశేఖర్‌రెడ్డి, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

చేప ప్రసాదం వేయిస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షుడు లక్ష్మన్‌రావుగుప్త

భజరంగ్ సేనా ఆధ్వర్యంలో సహాయ సహకారాలు

అఫ్జల్‌గంజ్, జూన్ 8 ప్రభాతవార్త: మృగ శిర కార్తెను పురస్కరించుకుని చేప ప్రసాదాన్ని వేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త మాట్లాడుతూ ప్రతి ఏటా మృగశిర

మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మానవ విలువలు కాపాడేవి సంప్రదాయం కళలు

మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

రవీంద్రభారతి, జూన్ 8 ప్రభాతవార్త : నేటిసమాజంలో మానవతా విలువలు మృగ్యమై పోతున్న దుస్థితిలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు మానవ విలువలను కాపాడడమే కాకుండా దర్పణం నిలుస్తున్నాయని, ఉజ్వల సంస్థ సకలకళావైభవ కార్యక్రమంతో వాటిని ప్రోత్సహించడం హర్షదాయకమని తెలంగాణ శాసనసభ తొలి సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. దశాబ్దాల పోరాటం, ఎంతోమంది ఉద్యమకారుల, త్యాగధనుల, ఆత్మబలిదానాలతో ప్రజాస్వామికరీతిలో పోరాడి సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మక రాష్ట్రఆవిర్భావ ఐకాన్ అవార్డులతో వివిధరంగాల్లో సేవామూర్తులను సన్మానించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రముఖ సాంస్కృతిక, సామాజిక, స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో తిలక్‌రోడ్ తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదిక ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు ఎన్.సత్యనారాయణ యాదవ్(సతీష్), సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎం.లక్ష్మి నేతృత్వంలో శనివారం రాత్రి సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన సకల కళావైభవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ తొలి శాసనసభ సభాధ్యక్షుడు,ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, గౌరవ అతిథులు అనిల్‌యాదవ్, రాగిణి, డా. కె.వీరభోగ వసంతరాయలు, గౌతమ్, రుద్ర కోటేశ్వరరావు, ఈశ్వరయ్య తదితరులతో కలిసి వివిధరంగాల్లో విశేష సేవలు అందిస్తున్న 12 మంది ప్రతిభావంతులను ఘనంగా సత్కరించి ఐకాన్ అవార్డులను ప్రదానం చేసి మున్ముందు తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషిచేయాలనిసూచించారు. సభకుముందు పలు సాంస్కృతిక కళాప్రదర్శనలు ఆహుతులను అబ్బురపరిచాయి.

తెలంగాణ ఆవిర్భావ ఐకాన్ అవార్డులతో సత్కరిస్తున్న మధుసూదనాచారి తదితరులు

ఘనంగా ఏరువాక

పేట్‌బషీరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త : హైదరాబాద్‌లోని సుందర్ ఎడ్యుకేషనల్ అకాడమీ, కొంపల్లిలో రైతుల సాంస్కృతిక ఉత్సవమైన ఎరువాక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన 60 మంది రైతు లను గౌరవించి వారి కష్టసాధ్యమైన కృషి పనికి గుర్తింపునిచ్చారు. ఈకార్యక్రమానికి మాజీ మంత్రి, సినీనటుడు బాబుమోహన్, సినీనటి కవిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మనకు అత్యంత ముఖ్య మైనవారని, వారి కృషిసేవలను గుర్తించడం చాలా సంతోషకరమన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, మార్కెటింగ్ సమస్యలు, తక్కువ ధరలు మొదలైన విషయాలపై వివరించారు. ఈ కార్య క్రమంలో సహాయ కమిషనర్, హార్టికల్చర్, హందా డాక్టర్ చక్రపాణి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. ఎస్ఎస్, సెంట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ ఎన్.పి. సుందర రాజు, నవ నిర్మాణ ఫౌండేషన్, ఫౌండర్ రంబాబు, బిగ్ బాస్ ఫేమ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయం ప్రాముఖ్యత, ఏరువాక పండుగ సంప్రదాయ విలువల గురించి వివరించారు. ఏరు వాక రైతుల వ్యవసాయ కార్యక్రమాల ప్రారంభానికి నాంది అని, ఈ సంప్రదాయాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయం అవసరని, పురుగుమందులు లేని సేంద్రియ పంటలు సాగు చేయడానికి రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతులు తమ కృషి పనికి గుర్తింపు లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సెంట్ ఆంథోనీ స్కూల్ విద్యార్థులు రైతుల కోసం అందమైన సాంస్కృతిక ప్రదర్శనలుచేసి, అందరిని ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల శ్రమకు గౌరవం తెలుపుతూ, సవాళ్లు, అవసరాలను ప్రజలకు తెలియజేసారు.

మణికొండలో బాల్ బాట్మెంటిన్ పోటీలు ప్రారంభం

నార్సింగి, జూన్ 8 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మాగాంధీ పార్కులో ఎన్ఎండిసి సహకారంతో ఆదివారం బాల్ బాట్మెంటిన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో మణికొండ, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, గాయత్రీ, చేవెళ్ల, సీతాఫల్ మండి, అజంపురా, ఎన్‌జిఓ, భోపాల్‌పల్లి, ఘట్టుప్పల్, బిహెచ్ఇఎల్, సంకల్ప జట్లు పాల్గొన్నాయి. యువకులు, వృద్ధులు రెండు వేరువేరు ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. క్రీడాపోటీలు ప్రారంభించిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆటల వలన సంపూర్ణ ఆరోగ్యం, ఐకమత్యం, విజయ కాంక్ష, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే గుణం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎండిసి నవరత్న, జెంటిల్‌మెన్ ఆసుపత్రికి చెందిన సంతోష్, సంస్థ అధ్యఓఉలు రామ్మోహన్‌రావ్, ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్, హరనాథ్‌రెడ్డి, నరహరి శాస్త్రి, రమేష్, శ్రీనివాస్, సలహాదారు అందె లక్ష్మణ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో సామాజిక న్యాయం

-మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాటించారని మాలమహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు తల్లమల్ల హసేన్ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వంలో మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనుయాయులు చెన్నూరు శాసనసభ్యులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి అభినందించి సత్కరించారు. ఆదివారం జరిగిన సమావేశంలో తల్లమల్ల హస్సేన్ సిఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలో సామాజిక న్యాయ దిశగా ఎస్సీలలో డాక్టర్ వివేక్ వెంకట స్వామికి, అడ్లూరి లక్ష్మణ్, బీసీలలో వాకిటి శ్రీహరి మంత్రి పదవులు ఇవ్వడం ఎస్టీలలో అసెంబ్లీ ఉపసభాపతిగా డాక్టర్ రామచంద్రనాయక్ ను నియమించటం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, సోనియా గాంధీలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతి రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య, మంచాల వెంకట స్వామి, ముల్లగిరి కాంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంతేటి వీరభద్రం,బేగారి శివరాజ్, రాష్ట్ర కార్యదర్శిలు దాసరి దేవయ్య, జాతీయ కమిటీ సభ్యులు బండి అశోక్, ముండ్ల గిరి, కాంతయ్య,తెలంగాణ జిల్లాల బాధ్యులు బోయిల అఖిల్, బండ వరప్రసాదరావు పల్ల రాజశేఖర్, దండు రాజు, పాశం వెంకటేశ్వర్లు, గాలయ్య, సామరాజు,కట్ట దుర్గాప్రసాద్, సంద యాదయ్య,ఏడిండ్ల అశోక్, పిడతల శ్రీను, కంచర దాసు ఆనందరావు సామారాజు, మన్నె కృష్ణయ్య, దొంత సత్యం మాల మహానాడు రాష్ట్ర కమిటీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు.



మంత్రివర్గంలో స్థానంపొందిన వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న నేతలు

ప్రతిభావంతులను సత్కరించడం మంచి సంప్రదాయం

-తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్సిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవసభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ హాజరై ఉత్తమ ప్రతిభ కబబర్చిన వారికి పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్, యువజన విభాగం అధ్యక్షులు పెద్దపట్ల భరత్ కుమార్, యువజన ప్రధాన కార్యదర్శి కడపల సోమేశ్, కోశాధికారి నాయకోటి మహేష్, సమన్వయకర్త శివకుమార్, సెంట్రల్ కమిటీ సభ్యులు శశి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ పాటలు, రాష్ట్ర కోశాధికారి కళ్ళపల్లి రాజప్ప, జిహెచ్ఎంసి అధ్యక్షులు శివ శరణ్, మహిళా అధ్యక్షులు సూర్య శ్రావణి, ప్రధాన కార్యదర్శి విద్యుత్ లత, యువజన కార్యదర్శి గిరుకల ఆంజనేయులు విజయ్ శశివర్ధన్ రవి, జి ఆర్ పి రఘు, రాకేష్ పాల్గొన్నారు.కార్యక్రమంలో 250 మందికి సత్కరించారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ఐడి కార్డ్‌లను పంపిణీ

కెపిహెచ్బి కాలనీ, జూన్ 8, ప్రభాతవార్త : కెపిహెచ్బి కాలనీ 5వ ఫేస్ జనసేన పార్టీ ఆఫీస్ వద్ద కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వము నమోదు చేయించిన వాలంటరీలకు జన సైనికులకు, వీర మహిళలకు సభ్యత్వ ఐడి కార్డులను కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఐదు లక్షల చొప్పున అందించి వారి కుటుంబాలకు భరోసానిచ్చిన అధినేత పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ ఇటువంటి 5 లక్షలు ఇచ్చే ఆలోచన ఏ రాజకీయ పార్టీలో లేదని కేవలం జనసేన పార్టీలోనే ఉందని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 3000 పైచిలుకు క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయించిన వాలంటీరులను అభినందిస్తూ రాబోయే రోజులలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి డివిజన్‌కి 3000 పైచిలుకు క్రియాశీలక సభ్యత్వాలు చేయించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలక సభ్యత్వము నమోదు చేయించిన వాలంటరీలు కొల్లా శంకర్, సలాది శంకర్, దొరబాబు (వెంకట్), పోలే బోయిన శ్రీనివాస్, మత్తి శ్రీనివాస్, ప్రభు చైతన్య, పులగం సుబ్బు, భూ శంకర్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పాదం సూర్యా, పుష్పలత జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

సివిల్ సర్వెంట్లు దేశ నిర్మాణంలో కీలకపాత్ర

-మహారాష్ట్ర పూర్వ గవర్నర్ విద్యాసాగర్‌రావు

చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: సివిల్ సర్వెంట్లు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ రావు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ట్వెంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో యుపిఎస్‌సి సివిల్ సర్వీసుల్లో విజయం సాధించిన అభ్యర్థులను సత్కరించే కార్యక్రమం జరిగింది. వీరంతా దేశానికి వెన్నెముకలవలె ఉండడంతో పాటు ఈ వ్యవస్థను డా. బి.ఆర్. అంబేద్కర్, సర్దార్ వల్లభభాయి పటేల్ ఆశయాలను అనుసరించేలా నిర్మించాలన్నారు. భారతదేశం సాంస్కృతికంగా వైవిధ్యభరితమైన దేశం అని చెప్పుకొచ్చారు. అదనపు డీజీపీ మహేష్‌భాగవత్ మాట్లాడుతూ విద్యార్థులకు మూర్గనిర్దేశనంచేశారు. ట్వింటిఫస్ట్ సెంచరీ సంస్థ అధినేత కృష్ణప్రదీప్ మాట్లాడుతూ అకాడమి రజతోత్సవ సంవత్సరం 2028 నాటికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కనీసం వంద మంది అభ్యర్థులను యుపీఎస్‌సి సర్వీస్‌కు ఎంపిక చేయడం తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో యుపిఎస్‌సి, గ్రూప్స్ పోలీపరీక్షలకు అత్యుత్తమ శిక్షణ అందించే ప్రముఖ సంస్థగా గుర్తింపుపొందిందన్నారు. 2వేలకపైగా విద్యార్థులకు ఐఎఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ సర్వీసుల్లో విజయాలు సాధించారన్నారు. సభలో యు-3 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యపట్ల శ్రద్ధచూపాలి : ఎమ్మెల్యే

చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటైన జన ప్రియ అబోడ్స్ వాకర్స్‌క్లబ్ గాంధీ నగర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జి.నాగాధర్, కె నిరంజన్, కోశాధికారిగా జి హరిప్రసాద్ నియమితులయ్యరు. వీరి చేత డిస్టిక్ గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. క్లబ్బు నూతన అధ్యక్షుడు జి.నగాధర్ మాట్లాడుతూ తమ క్లబ్బు వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301కు అనుబంధంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని, వినయ్బ్బు కుమార్, బిజెపి సికింద్రాబాదు పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఏ వినయ్ కుమార్, పూర్వ గవర్నర్ శ్రీనివాస చారి, కాబోయే డిస్టిక్ గవర్నర్ గంగాధర్ రెడ్డి, డిస్టిక్ క్యాబినెట్ కార్యదర్శి శైలజా మోహన్, జనప్రియ అబోడ్స్ కే మల్లేష్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కే మల్లేష్, ఏపీపీ విజయలక్ష్మి జనప్రియ కబోర్డ్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

అస్ట్రేలియాలో తలసానికి ఘన స్వాగతం

కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త: మాజీమంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనకు ముగించుకొని తిరిగి స్వదేశానికి విచ్చేస్తున్న సందర్భంగా శనివారం రాత్రి సిడ్నీ నగరంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, బిఆర్ఎస్ యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్ పాల్గొని అక్కడి తెలుగు ప్రజలను కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటికి సంతాపం

జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి చెందడం పట్ల తెలంగాణకు, బిఆర్ఎస్ పార్టికి తీరనిలోటు ఏర్పడిందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాగంటి గోపినాథ్ మరణ వార్త తెలుసుకొని ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా 3 పర్యాయాలు విజయం సాధించి నియోజకవర్గం ప్రజలకు ఎంతో కృషి చేశారన్నారు.

మాగంటి మృతి పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

సికింద్రాబాద్, జూన్ 8 ప్రభాతవార్త: జుబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ తీవ్ర దిగ్భ్రంతిని వ్యక్తం చేశారు. ఆయన కన్నుమూసిన సమాచారాన్ని జీరించుకోలేక పోతున్నానని పద్మారావుగౌడ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు శాసనసభ్యునిగా విజయం సాధించి ప్రధానంగా పేద, అణగారిన, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నిరంతరం మాగంటి శ్రమించారని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. తనకు సుదీర్ఘ కాలంగా వ్యక్తిగత అనుబంధం ఉందని, నిస్వార్థంగా సేవలు అందించి ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల మన్ననలను ఆయన పొందారని తెలిపారు. మాగంటి మృతి పార్టీకి తీరని లోటని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మాగంటి గోపీనాథ్ మృతి విచారకరం : సాయిబాబా

ముషీరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణం విచారకరమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం సంతాప సందేశం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా, తెలుగు యువత అధ్యక్షులుగా వివిధ పదవులు చేపట్టిన మాగంటి గోపీనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నామని పేర్కొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి అభినందనలు

గౌడ కల్లు సంఘాల సమన్వయ కమిటీ నేతలు

శ్రీహరిని అభినందిస్తున్న గౌడ కల్లు సంఘాల సమన్వయ కమిటీ నేతలు బాల్‌రాజ్‌గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు

హైదరాబాద్,జూన్ 8 ప్రభాతవార్త : బీసీలకు మంత్రివర్గంలో పెద్దపీట వేసి వాకాటి శ్రీహరికి మంత్రి వర్గంలో స్థానం కల్పించడం పట్ల తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ హర్షం వ్యక్తం చేశారు.మృదుస్వభావి, నిరాంబరుడు, అణగారిన వర్గాలకు అండగా ఉండే నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడుగా మన్ననలు పొందిన వాకాటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చి బీసీలకు సామాజిక న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విద్యా , ఉద్యోగ, రాజకీయ , సామాజిక రంగాలలో వాటా కల్పిస్తూ ముందడుగు వేసి కేంద్ర ప్రభుత్వం కూడా జన గణన ప్రక్రియ లో భాగంగా కుల గణన చేసేలా చొరవ చూపి కృషి చేసిన మంత్రి శ్రీహరి పాత్ర చాలా ఉందన్నారు. సామాజిక న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ లోని అన్ని కుల సంఘాల అభివృద్ధి చెందడానికి మా బాధ్యతగా నిలబడి న్యాయం చేస్తానని అన్నారు.కుల వృత్తుల సంక్షేమమే మా ప్రధాన ఎజెండా అని భవిష్యత్తులో అన్ని విధాలుగా బీసీలు ముందుకు వెళ్లడానికి రాహుల్ గాంధీ ,మల్లిఖర్జున్ ఖర్గే,రేవంత్ రెడ్డి సహకారం రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ లకు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకాటి శ్రీహరిని శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చంతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**నూతన మంత్రి శ్రీహరి ముదిరాజ్‌కు శుభాకాంక్

నేడు నందిగామకు ఎమ్మెల్యే రాక

నందిగామ జూన్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పనులకు భూమి పూజ చేసేందుకు సోమవారం ఉదయం9 గంటలకుషాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నందిగామ కు రానున్నట్లు మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ తెలిపారు. అనుక్షణం అభివృద్ధిని ఆకాంక్షి ంచే ఎమ్మెల్యే వస్తున్న సందర్భంగాకాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇందిరమ్మ గృహ నిర్మాణాల లబ్ధిదారులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వధువుకు 50 వేల రూపాయల విరాళం

ఘట్‌కేసర్‌రూరల్, జూన్8, ప్రభాతవార్త: పోచారంమున్సిపల్ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన యు. బలరాం కూతురు వివాహానికి 50 వేల రూపాయల నగదును మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ మాజీ 9 వ వార్డు కౌన్సిలర్ బాల్‌రెడ్డి పాల్గొని నూతన దంపతులకు 50 వేల రూపాయలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు డి.శంకర్,నాయకులు నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆదర్శయూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలడుగు శివచౌదరి, మదన్‌మోహన్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

మంత్రిని కలిసిన ముదిరాజ్ సంఘం నేతలు

షాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న వాకిటి శ్రీహరిని ముదిరాజ్ సంఘం నేతలు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి మంత్రికి హార్థికశుభాకాంక్షలుతెలిపారు.దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూధన్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, శంషాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు నీరటి రాజు, మహేందర్, సాయి, పాల్గొన్నారు.

మంత్రివర్గంలో వరంలకు ప్రాధాన్యత కల్పించాలి

కొడంగల్,జూన్ 8ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లీంలకుప్రాధాన్యత కల్పించకపోవడం సరికాదని మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం.గౌసన్ అన్నారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గంలో ముస్లీంలకు చోటుదక్కకపోవడంతో ముస్లీం,మైనార్టీల్లో చికాకు కల్గిస్తుందని అన్నారు.ఒక్క ముస్లీంఎంపీ లేదా క్యాబినెట్ మంత్రి కూడా లేకపోవడం సరికాదన్నారు.ఎమ్మెల్సీగా కొనసాగుతున్న అమీర్ అలీ ఖాన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకుంటే బాగుండేదిని,ముస్లీంలకు సముచిత స్థానం దక్కడం లేదని మైనార్టీల్లో అసంతృప్తి వ్యక్త మవుతుందన్నారు.రానున్న రోజుల్లోనైనామంత్రివర్గంలో ముస్లీంలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

రు.50 వేల విరాళం అందజేసిన మాజీ కౌన్సిలర్

ఘట్‌కేసర్‌రూరల్,జూన్8,ప్రభాతవార్త:పోచారంమున్సిపల్ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన యు. బలరాం కూతురు వివాహానికి 50 వేల రూపాయల నగదును మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ మాజీ 9వ వార్డు కౌన్సిలర్ బాల్‌రెడ్డి పాల్గొని నూతన దంపతులకు 50 వేల రూపాయలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు డి. శంకర్, నాయకులు నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆదర్శయూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలడుగు శివచౌదరి,మదన్‌మోహన్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ముస్లీంలకు ప్రాధాన్యత కల్పించాలి

కొడంగల్,జూన్ 8ప్రభాతవార్త

తెలంగాణా రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లీంలకు ప్రాధాన్యత కల్పించక పోవడంసరికాదని మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం.గౌసన్ అన్నారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గంలో ముస్లీంలకు చోటు దక్కకపోవడంతో ముస్లీం,మైనార్టీల్లో చికాకు కల్గిస్తుందని అన్నారు.ఒక్క ముస్లీంఎంపీలేదాక్యాబినెట్‌మంత్రికూడా లేకపోవడం సరికాదన్నారు.ఎమ్మెల్సీగా కొనసాగుతున్న అమీర్ అలీ ఖాన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకుంటే బాగుండేదిని,ముస్లీంలకు సముచిత స్థానం దక్కడం లేదని మైనార్టీల్లో అసంతృప్తి వ్యక్త మవుతుందన్నారు.రానున్న రోజుల్లోనైనా మంత్రివర్గంలో ముస్లీంలకు సముచిత స్థానం కల్పించాలని కోరార

యువతలో క్రీడాస్ఫూర్తిని నింపే క్రికెట్ టోర్నీ

కౌన్సిలర్ గోపాల్ గౌడ్

కొత్తూరు, ప్రభాతవార్త, (జూన్8) : మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కౌన్సిలర్ మాధవి గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో క్రికెట్ టోర్నమెంటును నిర్వహించారు. ఈ టోర్నీలో పలు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు కౌన్సిలర్ చేతుల మీదుగా విన్నర్ షీల్డు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాటాన్లడుతూ యువత శారీరకంగా ధృఢంగా, మానసికంగా చురుకుగా ఉండాలంటే క్రీడలే ఉత్తమ మార్గమని, క్రికెట్ వంటి ఆటల ద్వారా పటుత్వం, పోటీతత్వం పెంపొందుతుందని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతను డ్రగ్స్, సోషల్ మీడియాలో మునిగిపోయే వాతావరణం నుండి దూరంగా ఉంచే అవకాశం ఉందని, భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించే సంకల్పం తనకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కుమ్మరి వెంకటేష్, చిటికెల వెంకటేష్, బండారి భరత్ గౌడ్, వినయ్ కుమార్, సందీప్, వరుణ్, శరత్, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేబినెట్ విస్తరణలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

షాద్‌నగర్, ప్రభాతవార్త, (జూన్8) : విద్యారంగంలో అనుభవం ఉన్న సామాజిక న్యాయంపై నిబద్ధత కలిగిన నాయకుడిని మంత్రిగా నియమించాలని, విద్యాశాఖ బడ్జెట్ వినియోగం, కార్యక్రమాల అమలులో పారదర్శకతను నిర్ధారించడానికి మంత్రి నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. తెలంగాణ కేబినెట్ విస్తరణలో విద్యాశాఖ కేటాయింపు అవసరం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలలుగా విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకుండా, మంత్రిమంత్రి స్వయంగా నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణలో విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు

మానవజీవనానికి సంజీవని శాస్త్రీయ నృత్యకళ

కేంద్రసంగీతనాటక అకాడమీ అవార్డుగ్రహీత కళారత్న సురభి ఆర్.వేణుగోపాల్‌రావు

నాంపల్లి, జూన్ 8 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ, జానపద, సంప్రదాయ నృత్యకళలు మానవ జీవనానికి మహత్తరమైన సంజీవని వంటివని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళారత్న సురభి ఆర్.వేణుగోపాల్‌రావు అన్నారు. పిల్లలకు చిన్ననాటి నుండే శాస్త్రీయ నృత్యకళలను అభ్యసింపజేస్తే వారు జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిగమించి శిఖరాయమానంగా పేరుప్రఖ్యాతులు గడిస్తారని స్పష్టం చేశారు. ప్రముఖ అకాడమీ ఆఫ్ డాన్స్, మ్యూజిక్, ఫైన్‌ఆర్ట్స్ సంస్థ శివానందలహరి విద్యార్థులను అత్యుత్తమ కళాకారులుగా తీర్చిదిద్ది భారతీయ కళాసంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో అందెవేసిన చెయ్యని కొనియాడుతూ సంస్థ గురువుల కళాసేవలను ప్రశంసించారు.

ఈ సందర్భంగా కళాకారులు తమ శాస్త్రీయ నృత్యప్రదర్శనలను ముందుగా గణేశ భజనతో ప్రారంభించి పుష్పాంజలి నృత్యం, ముకుంద ముకుంద, సరస్వతీదేవి స్తుతిగీతం, నటేషకౌత్వం, జతిస్వరం, భగవద్గీత శ్లోకాలు, స్వాగతం కృష్ణా, తిల్లానా తదితర అశాలను, చివరిగా మంగళం అద్భుతంగా ప్రదర్శించి విచ్చేసిన అశేషప్రేక్షకుల, కళాప్రియులను మైమరపించి శుభాశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రసంగీత నాటకఅకాడమీ అవార్డుగ్రహీత సురభి ఆర్.వేణుగోపాల్‌రావు, గౌరవ అతిథులు డా. ఎం.జపమాల రాణి, గురు శ్యామల శ్రీనివాస్, కె.జయశ్రీ, సంస్థ అధ్యక్షుడు బి.వివేకానంద (రాజు), బి.జ్యోతి తదితరులతో కలిసి విద్యార్థులకు శాస్త్రీయ నృత్యపరీక్షల ధృవపత్రాలను ప్రదానం చేసి శుభాశీస్సులు అందజేసి మున్ముందు గొప్పకళాకారులుగా అత్యున్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళి

బిఆర్ఎస్ నాయకుల శ్రద్ధాంజలి

షాద్‌నగర్, ప్రభాతవార్త,జూన్8 : షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచనల మేరకు షాద్‌నగర్ ముఖ్య కూడలిలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలియజేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మణ్ నాయక్, వీరేశం, శ్రీనివాస్ రెడ్డి, చిన్న యాదగిరి, రాఘవేందర్, శరత్ కృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వంతెనలకు శ్రీకారం క్షేమదాయకం

షాద్‌నగర్,ప్రభాతవార్త,జూన్8:జాతీయ రహదారిపై పై వంతెనల నిర్మాణంతో గ్రామీణుల ప్రయాణానికి ఎంతో క్షేమకరమని, దీనికోసం కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలని కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి పేర్కొన్నారు. షాద్‌నగర్ బైపాస్ కొత్తూరు నుండి బూర్గులవరకు జాతీయరహదారిపై రూ.100 కోట్లకు పైగా వ్యయంతో పైవంతెనల నిర్మాణానికి కృషి చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇట్టి పైవంతెనలు ఎంతో ఉపయోగపడతాయని కేశంపేట, కొత్తూరు, ఫరూఖ్‌నగర్ మండలాలకు సంబంధించిన ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుందని, అదేవిధంగా బెంగళూరు హైవేపై రాకపోకలు కొనసాగిస్తున్న సుదూర ప్రయాణీకులకు ఎంతో క్షేమకరమని అన్నారు.

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మృతిపై దిగ్భ్రాంతి

షాద్‌నగర్, ప్రభాతవార్త,జూన్8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్ రెడ్డి. మూడుసార్లు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన కృషిని గుర్తు చేశారు. ఇది బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. గోపీనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం

ఘట్‌కేసర్, జూన్ 8, ప్రభాతవార్త: అప్పులబాధతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీకి చెందిన ధర్మబోయిన శంకరయ్య (62) ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లగా అతని కోసం అంతటా గాలించగా ఆచూకి లభించలేదు. దీంతో ఇంట్లో శంకరయ్య భార్య పరిశీలించగా శంకరయ్య మూడు జతల దస్తులు, బ్యాక్ పాస్ పుస్తకాలను తీసుకొని వెళ్లాడు. గతంలో అప్పుల భాధతో శంకరయ్య ఇంటి నుంచి వెళ్లిపోయి ఐదారు రోజులకు తిరిగి వచ్చాడని తెలిపారు. ఈమేరకు శంకరయ్య కుమారుడు ధర్మబోయిన తరుణ్ ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో పూజలు

చార్మినార్,జూన్8 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో జోగిని నిషా క్రాంతి ఆదివారం పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు జి.రాఘవేందర్,అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం కమిటి అధ్యక్షులు డి.ఆర్.ప్రభాకర్ రావు,కమిటి ప్రతినిధులు రాందేవ్ అగర్వాల;జగన్మోన్ కపూర్,ఏ.సతీష్,ఎస్.పి క్రాంతిఆ కుమార్,ఎం.వినోద్, జి.శ్రీనివాస్,సాయినాథ్,మేకల బండ నల్ల పోచమ్మ ఆలయం కమిటి ప్రతినిధి గోల్కొండ నవీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,జూన్ 8 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 9వ తేదీ సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటలు వరకు చందూలాల్ బారా దరి,ఖాజా ఫంక్షన్ హాల్ ,రంనాస్‌పుర, బహదూర్‌పుర, ఫ్రిన్స్ కాలనీ,బారాదరి విద్యుత్ కార్యాలయం,10 నుంచి 12 వరకు కమేలా ,రంనాస్‌పుర,2.30 నుంచి 3.30 వరకు ఐటిఐ కాలనీ,మోచీ కాలనీ,3.30 నుంచి 5.30గంటలు వరకు పురానాపూల్,బహదూర్‌పుర, దేవిబాగ్,దూద్‌బౌలి,9 నుంచి 12 గంటలు వరకు నలంద నగర్,వెంకటేశ్వర్‌ఎన్‌క్లేవ్,డాక్టర్ కాలనీ, సిరిమల్లె నగర్,లోటస్ స్కూల్,న్యూ ఫ్రెండ్స్ కాలనీ,లక్ష్మీ నగర్, ప్లీశాంత్ పార్కు,సోమిరెడ్డి నగర్,నందన వనం ,2.30 నుంచి 5.30 వరకు జనప్రియ అపార్టుమెంట్,లక్ష్మీనగర్,ప్లీశాంత్ పార్కు,లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు

షాద్‌నగర్,ప్రభాతవార్త, జూన్8 : కాంగ్రెస్ రాజ్యంలో పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని షాద్‌నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేత, మాజీ వార్డు సభ్యుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ కార్యకర్తలకే దళిత బంధు ఇచ్చారని గుర్తుచేశారు. అది కూడా ఊరికి ఒకటి, రెండు మాత్రమే ఇచ్చారని, ఒక్కో ఊరిలో మొత్తమే రాలేదని అన్నారు. ఇచ్చిన దళిత బంధు కూడా ఆర్థికంగా ఉన్నవారికి ఇచ్చారని, ఆ పార్టీ దళితుల్లో కూడా ఒక్కరికి ఇద్దరికి ఇచ్చి దళితుల మధ్యన చిచ్చుపెట్టారని గుర్తు చేశారు. పేరుకు ప్రజలందరికీ సీఎం రిలీఫ్ పండ్ అందులో కూడా బీఆర్ఎస్ కార్యకర్తలను గుర్తించి తమ పార్టీ వారికే అందజేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో పార్టీలకతీతంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇండ్లు అందుతాయని ఎర్రోళ్ల జగన్ తెలిపారు.

మహిళా శక్తిని చాటుదాం

షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్8 : సమాజంలో అన్ని రంగాల్లో మహిళల శక్తిని చాటాలని ఫరూఖ్‌నగర్ మండలం బీసీసన అధ్యక్షురాలు జక్కుల జలజ పిలుపునిచ్చారు. మండల బీసీసేన అధ్యక్షురాలు జలజ ఆధ్వర్యంలో మహిళా కమిటీరంగంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించడం జరిగింది. అధ్యక్షురాలుజక్కులజలజ మాట్లాడుతూ బీసీలందరు ఏకతాటిపైకి రావాలని, ప్రతి మహిళ చైతన్యవంతురాలు కావాలని గ్రామాల వారిగా, పట్టణాల వారిగా ఎదుగుదల అనేది మహిళల నుండి సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో రంగంపల్లి గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఫరూఖ్‌నగర్ మండల సహాయ కార్యదర్శిగా పురుగుల సుజాతని ఎన్నుకోవడం జరిగిందని, రంగంపల్లి గ్రామంలో బీసీలు ఎప్పుడు ముందంజలో ఉండాలని, ప్రతి ఒక్క మహిళ ముందుకు రావాలని వారి మాటల ద్వారా గ్రామ కమిటీలోని సభ్యులకి తెలియజేయడం జరిగిందని, ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా జిల్లా బీసీసేన అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్, అసెంబ్లీ బీసీసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప, జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షురాలు జయ శ్రీకాంత్, ఫరూఖ్‌నగర్ మండల ఉపాధ్యక్షురాలు అనుప స్రవంతి రాజు, కార్యక్రమాన్ని గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. అధ్యక్షురాలిగా పురుగుల అంబమ్మ, ఉపాధ్యక్షురాలిగా పురుగుల లావణ్య, ప్రధాన కార్యదర్శిగా పురుగుల స్వరూప, కార్యదర్శి జవ్వాజి అనిత, సహాయ కార్యదర్శిగా పురుగుల లలితను ఎన్నుకున్నారు.

అంబేద్కర్ స్ఫూర్తిని ప్రజలలోకి తీసుకువెళ్లాలి

ఘట్‌కేసర్, జూన్ 8, ప్రభాతవార్త: అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు రిజర్వేషన్లు, పదవులు సిద్ధిస్తున్నాయని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 217వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార య్రక్రమంలో డిసిసి కార్యదర్శి అంజనేయులు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అన ంతరం భారత రాజ్యాంగ పీఠికపై అరుణ్‌కుమార్ ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో నాయకులు కె.నర్సింగ్‌రావు, తాల్క రాములు, రాజేశ్‌కుమార్, నర్సింగ్‌రావు, గణేశ్‌గౌడ్, కృష్ణంరాజు, ఆనంద్, రామప్ప, విష్ణు, లలిత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకాకుండా దశరథ్ నాయక్ ముందస్తు అరెస్ట్

కడ్తాల్,జూన్ 8, ప్రభాత వార్త : రేవంత్ సర్కార్ అధికారంలోకి రాకముందు అనేక మాయ మాటలు చెప్పి గిరిజనులను మోసం చేసిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ గిరిజనులకు ఇచ్చిన హామీలలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న గిరిజన సమావేశానికి హాజరుకావడానికి వెళుతున్న దశరథ్ నాయక్ ను కడ్తాల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తనను అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమం ఆపే ప్రసక్తే లేదని దశరథ్ నాయక్ తేల్చి చెప్పారు

ఎంఐఎం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్

చార్మినార్,జూన్8ప్రభాతవార్త: ఎంఐఎంఐఎం ఆధ్వర్యంలో దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈద్ మిలాప్ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఐఎం అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ,ఎంఐఎం ప్రధాన కార్యదర్శి సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి,యాకుత్‌పుర ఎమ్మెల్యే మెహరాజ్‌హుస్సేన్,కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయిద్దీన్,బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్,మాజీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్సీ అఫెందీతో పాటు ఎంఐఎం కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం పంపిణీ

చార్మినార్,జూన్ 8 ప్రభాతవార్త : మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని గౌడ్ సోదరుల నివాసంలో ఆదివారం చేప ప్రసాదంపంపిణీ కార్యక్రమం జరిగింది.నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌లో గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ జరిగినప్పటికి గౌడ్ సోదరుల తమ కుటుంబ సభ్యులకు,బంధువులతో పాటు దూర ప్రాంతాలు నుంచి వచ్చిన అస్తమా వ్యాధిగ్రస్థులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేశారు.సోమవారం దూద్‌బౌలిలోని బత్తిని గౌడ్ సోదరుల నివాసంలో చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నామని బత్తిని గౌరీశంకర్ గౌడ్ తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అందె బాబయ్యను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

షాద్‌నగర్ బీజేపీ నాయకుల ఆగ్రహం

షాద్‌నగర్, ప్రభాతవార్త, (జూన్8) : సలహాకు, విమర్శకు తేడా తెలియని కాంగ్రెస్ నాయకులకు బీజేపీ నేత అందె బాబయ్యను విమర్శించే స్థాయి లేదని షాద్‌నగర్ బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాబయ్య రాజకీయ జీవితం ప్రారంభించినప్పుడు మీలో కొంతమంది పుట్టే ఉండరని, మీ సంక్షేమ పథకాలు నిజంగా ప్రతి పేదవాడికి చేరితే మా బీజేపీ నాయకులు గ్రామాల్లో పర్యటించే పరిస్థితి ఎందుకొస్తుందని, ప్రజల్ని మోసం చేస్తూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచులు లేక, ఎన్నికలు నిర్వహించడం చేతకాక గ్రామాల్లో పాలన అస్తవ్యస్తమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాబయ్య తన హయాంలో ఎన్ని ఇల్లు కట్టించారో 30 ఏళ్ల వెనక్కి వెళితే తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 150 ఇందిరమ్మ గృహాల లబ్దిదారుల వివరాలు గ్రామ పంచాయతీలో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ సీనియర్ బీజేపీ నాయకులు, మండల అధ్యక్షులు, రామేశ్వరం, రాయికల్ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు. మీలాంటి తమ్ముళ్లు ఉన్నారు కాబట్టే బాబయ్యను ఓడించారుబీజేపీ నాయకుల తీరును విమర్శించిన మాజీ ఉప సర్పంచ్ సురేష్ యాదవ్‌ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్టుగా బీజేపీ నాయకుల వ్యవహారం మారిందని రామేశ్వరం డిప్యూటీ సర్పంచ్ సురేష్ యాదవ్ విమర్శించారు.

కాంగ్రెస్ నాయకులు వాస్తవాలు మాట్లాడితే బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, వాస్తవాలు గ్రహించలేకపోతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల గురించి బీజేపీ నాయకులు పరితపిస్తున్నారని, తప్పకుండా అన్ని పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇళ్లను ఇస్తారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నట్లుగా మౌనిక, భాస్కర్, కరుణ, నరేష్, శంషాబాద్ జయమ్మ, యాదయ్య గౌడ్‌లకు సంబంధించిన ఇల్లు కూడా జాబితాలో పేర్లు నమోదు చేయడం జరిగిందని, కళ్లుండి కూడా చూడలేని గుడ్డివాళ్లుగా బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత 30 ఏళ్లలో బాబయ్య ఎన్ని ఇళ్లు ఇచ్చారో ఖచ్చితంగా వెనక్కి వెళ్లి చూద్దామని, ఇల్లు ఇచ్చిన వారిని కలుసుకుందామని సవాల్ విసిరారు. బీజేపీ అధికారంలో ఇక్కడు అధికారంలో ఎప్పుడు లేదని, అంతకు ముందు బీఆర్ఎస్‌లో ఉండి ఎలాంటి ఇండ్లు ఇవ్వలేదని, బాబయ్య రెండు పార్టీలలో సాధించింది శూన్యమని, ఇది బీజేపీ నాయకులు తెలుసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఏం చేయాలో, ఏ పథకాలను ఎక్కడ ఉంచాలో తమకు తెలుసని బీజేపీ ఉచిత సలహాలు పొందే అవసరం తమకు లేదని అన్నారు.

మున్సిపల్ బిజెపి కార్యవర్గం ఎంపిక

ఘట్‌కేసర్, జూన్ 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి నూతన కార్యవర్గాన్ని అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ రాష్ట్ర,